క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్ 11కేవీ ఫీడర్‌పై చెట్ల కొమ్మల తొలగింపు మరమ్మతుల దృష్ట్యా కలెక్టర్ కార్యాలయం, మంజూర్‌నగర్, బీఎంఆర్ వెంచర్, వెంగల్‌రావు వెంచర్, బీసీ కాలనీ, మాధవరావుపల్లి, కుందూరుపల్లి ప్రాంతాల్లో నేడు (గురువారం) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విశ్వాస్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూపాలపల్లి పట్టణ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేటినుంచి గ్రామ సభలు

కాటారం : చిన్నకాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా ఆదివారంపేట చెరువు పరిధిలో ప్రధాన కాల్వల నిర్మాణానికి భూ సేకరణ కోసం నేడు(గురువారం), శుక్రవారం మండలంలోని ఆరు గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. గురువారం ఆదివారంపేట, గుమ్మాళ్లపల్లి, ఒడిపిలవంచ గ్రామపంచాయతీలకు సంబంధించి గుమ్మాళ్లపల్లిలో, శుక్రవారం రఘుపల్లి, జాదారావుపేట, వీరాపూర్ గ్రామపంచాయతీలకు సంబంధించి జాదారావుపేట గ్రామపంచాయతీలో భూ సేకరణ గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.కాల్వల నిర్మాణం కోసం ఆయా గ్రామాల నుంచి 45.39 ఎకరాల భూమి సేకరణ చేపట్టనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. రైతులు పాల్గొని తమ అభ్యంతరాలు, అభిప్రాయాలు గ్రామ సభ ద్వారా తెలపాలని కోరారు.

పంట భూముల సర్వే



కాళేశ్వరం : మహదేవపూర్ మండలం రాపల్లికోట, సూరారం, లక్ష్మీపూర్ గ్రామశివారుల్లో చిన్నకాళేశ్వరం కెనాల్, డిస్ట్రిబ్యూటరీల కోసం రైతుల పంట భూముల ఎంజాయ్‌మెంట్ సర్వేను రెవెన్యూ అధికారులు చేపట్టారు. బుధవారం ఆయా గ్రామాల్లో ఆర్ఐ జగన్‌మోహన్ రెడ్డి, సర్వేయర్ రమేశ్ సర్వే నిర్వహించారు. గురువారం కూడా సర్వే చేయనున్నారు.

నియామకం



నియామక పత్రం అందజేస్తున్న రాజు

మొగుళ్లపల్లి : ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ మండల అధ్యక్షుడిగా బండారి సదయ్యను నియమించారు. బుధవారం కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ మామిడి సుదర్శన్, రాష్ట్ర చైర్మన్ పులిగిల్ల బాలయ్యల ఆదేశాల మేరకు నియామకపు ఉత్తర్వులను జారీ చేసినట్లు జిల్లా అధ్యక్షుడు బండారి రాజు తెలిపారు. ఈ సందర్భంగా సదయ్య మాట్లాడుతూ 30ఏళ్లుగా సుదీర్ఘ పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ అమలుకై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు అమలు చేయాలన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర నాయకులకు సదయ్య కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



అరుట్ల సంపత్

టేకుమట్ల : మండలంలోని గర్మిళ్లపల్లికి చెందిన అరుట్ల సంపత్ మార్చి 30వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మూడ్రోజులుగా ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులను ఆశ్రయించారు. ఎవరికైనా సంపత్ ఆచూకీ తెలిస్తే వెంటనే 87126 58125, 90001 21844 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై సుధాకర్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



దుర్గయ్య మృతదేహం

కాటారం : మద్యానికి బానిస కావడంతో భార్య మందలించింది. క్షణికావేశంలో పురుగుల మందు తాగిన భర్త ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని దామెరకుంటలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దామెరకుంటకు చెందిన బోరెం దుర్గయ్య(50) కూలీ పనులు చేస్తూ ప్రతి రోజు మద్యానికి బానిస అయ్యాడు. భార్య సాలక్క ఇటీవల కూలీ పనులకు వెళ్లి గాయపడి ఇంటి వద్దనే ఉంటుంది. దుర్గయ్య భార్య, కూతురు మల్లీశ్వరీని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో భార్య సాలమ్మ నిత్యం మద్యం తాగితే కూతురు పెళ్లి ఎలా చేస్తాం, మద్యం మానేయమని దుర్గయ్యను మందలించింది. 'నేను ఇలానే మద్యం తాగుతా నువ్వేం చేసుకుంటావో చేసుకో'మని సాలమ్మను హెచ్చరించిన దుర్గయ్య క్షణికావేశానికి గురై మంగళవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించగా దుర్గయ్య చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య సాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై-2 శ్రీనివాస్ తెలిపారు.

వణికిస్తున్న వానరాలు



రాఘవాపూర్ ఇంటి ఆవరణలో కోతుల గుంపు



కొండెంగతో జీపీ సిబ్బంది

- ఆయా పంచాయతీల్లో కోతుల బీభత్సం
- కొండెంగతో కొంత ఉపశమనం..
- రక్షణ కల్పించాలని ప్రజల వేడుకోలు

టేకుమట్ల : వనం నుంచి జనంలోకి వానరాలు వస్తుడడంతో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. ప్రస్తుతం పంట చేనులోనే కాకుండా ఇళ్లల్లోకి చొరబడి నిత్యావసర సరుకులను తీసుకెళ్తూ, ఇంటి ఆవరణంలో పెంచుకుంటున్న పండ్లు, కూరగాయల మొక్కలను ధ్వంసం చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. కోతుల దాడులతో ఎంతో మంది తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందిన సంఘటనలు ఉన్నాయి.

కొండెంగ, పులి బొమ్మతో రక్షణ..

మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో కోతుల బెడద నిరంతరం సాగుతూనే ఉంది. కోతుల బెడద నుంచి కాస్త ఉపశమనం పొందేందుకు ఆయా గ్రామ పంచాయతీలు కొండెంగలను గ్రామాల్లో తిప్పుతూ కోతులను తరిమి వేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కొండెంగలు లేకపోవడంతో స్థానికులు ఇంటి ఎదుట పులి, కొండెంగ బొమ్మలను ఏర్పాటు చేస్తున్నారు. ఇంట్లోకి రాకుండా కోతులు రాకుండా వాటిని తరిమేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే రైతులు సాగు చేసిన పంటలను సైతం ధ్వంసం చేయడంతో పంట పొలాల్లో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి, విద్యుత్ కంచెలతో కోతుల నుంచి పంటలను రక్షించుకుంటున్నారు. మండల కేంద్రంలో ఎంతో మందిని గాయపర్చి, పండ్ల దుకాణాల్లో చొరబడి తీవ్ర నష్టాలు కలిగించిన సంఘటనలు కోకొల్లలు.



ఇంటి ఎదుట ఏర్పాటు చేసిన పులి బొమ్మ

కోతుల దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందిన వారి వివరాలు కొన్ని..

- మండల కేంద్రానికి చెందిన మాదారపు మల్లికార్జున్‌పై,రామకిష్టాపూర్(టి)లో పెసరు మల్లికార్జున్‌ను కోతులు తీవ్రంగా గాయపర్చడంతో మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అలాగే అచ్చె శశిరేఖపై దాడి చేయడంతో వెలిశాల పీహెచ్‌సీలో చికిత్స పొందారు.
- అంకుషాపూర్ గ్రామానికి చెందిన బండారి బాలయ్యను కోతులు తీవ్రంగా గాయపర్చడంతో చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాడు.
- ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కారుపాకల మొగిళిపై కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అలాగే అంగన్‌వాడీలో చిన్నారిపై దాడి చేసి గాయపర్చాయి.
- మండలంలోని రామకిష్టాపూర్(వి)లో దాసారపు సమ్మక్క అనే మహిళపై మంగళవారం కోతులు దాడి చేశాయి. వెంకట్రావుపల్లి(బి)లో కోతుల దాడిలో నల్లగాశ కోమల కాలు విరిగింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



ఉదయం నుంచి రాత్రి వరకు కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇంటి వద్ద కూరగాయాలు, పండ్ల చెట్టు పూర్తిగా ధ్వంసం చేస్తున్నాయి. పొలాల్లోను కోతుల మంద చేరడంతో పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. కొద్దిమంది రైతులు సోలార్ విద్యుత్ కంచెలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కొందరు రైతులు పంటలపై ఆశలు వదులుకుంటున్నాం. జిల్లా, మండల అధికారులు స్పందించి కోతుల నుంచి రక్షించాలి.

\- కొండ్ర ఓదెలు, రాఘవాపూర్

మెడికల్ టెక్నీషియన్లకు సన్మానం

మల్హర్ : జాతీయ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ దినోత్సవం సందర్భంగా మండలంలోని తాడిచర్ల 108 అంబులెన్స్ టెక్నీషియన్, తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ టెక్నీషియన్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా 108 అంబులెన్స్ టెక్నీషియన్ అడ్డూరి భాస్కర్, తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ వర్షిణిప్రియలను కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా చైర్మన్ దండు రమేశ్, తాడిచర్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సత్కరించారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ.. టెక్నీషియన్స్ గొప్పతనాన్ని కొనియాడారు. తాడిచర్ల గ్రామఅధ్యక్షుడు కేసారపు చంద్రయ్య, యూత్ అధ్యక్షుడు మేనం శ్రీనివాస్, తిర్రి సమ్మయ్య, కుంట సదానందం, ఆకుల శ్రీనివాస్, రావుల ఆంజనేయులు, మేడగాని చంద్రమౌళి పాల్గొన్నారు.

కార్గోలో రాములోరి తలంబ్రాలు

కాళేశ్వరం : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణం ముత్యాల తలంబ్రాలను టీజీఆర్టీసీ కార్గో లాజిస్టిక్ ద్వారా రూ.151 చెల్లించిన భక్తులకు ఇంటి వద్దకు అందజేయనున్నట్లు టీజీఆర్టీసీ విలేజ్ బస్ ఆఫీసర్ (వీబీఓ) చంద్రమౌళి తెలిపారు. బుధవారం ఆయన మహదేవపూ ర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కౌంటర్‌లో మాట్లాడారు. భద్రాచలం వెళ్లలేని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

మొగుళ్లపల్లి : మండల కేంద్రంతోపాటు మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. పోలీసు, గ్రామపంచాయతీ సిబ్బంది, విద్యుత్, వైద్యశాఖ సహకారంతో పకడ్బందీగా నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి తెలిపారు. మొగుళ్లపల్లి, మొట్లపల్లి రెండు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 266మంది విద్యార్థులకు గాను వంద శాతం హాజరైనట్లు ఎంఈఓ పేర్కొన్నారు. ఎస్సై బోరగాల అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలో పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిసినట్లు ఎంఈఓ ప్రకాశ్‌బాబు తెలిపారు. మొత్తం 403 మంది విద్యార్థులు మండల కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలకు హాజరైనట్లు ఆయన వెల్లడించారు.

బాధిత కుటుంబానికి చేయూత



బియ్యం, వంట సామగ్రి అందజేస్తున్న పుట్ట మధు

కాటారం : మండలంలోని దేవరాంపల్లి గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంతో ఇళ్లు కాలిపోయి సర్వం కోల్పోయిన జిముడ దుర్గక్క కుటుంబానికి మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేయూతనందించారు. బుధవారం బాధిత కుటుంబాన్ని పుట్ట మధు పరామర్శించి అగ్ని ప్రమాద సంఘటన గూర్చి అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, బియ్యం అందజేశారు. స్థానిక తహసీల్దార్ నాగరాజుకు ఫోన్ చేసి ప్రమాదంలో సర్వం కోల్పోయిన దుర్గక్క కుటుంబానికి తక్షణ సాయం అందించాలని కోరారు. అధైర్యపడొద్దని తాము అండగా ఉంటామని బాధిత కుటుంబానికి పుట్ట మధు భరోసా కల్పించారు. అనంతరం అదే గ్రామంలో ఇటీవల మృతి చెందిన బండి మధునయ్య కుటుంబాన్ని, పరికిపల్లి, ఆదివారంపేట గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న సమ్మయ్య, రత్న రమేశ్‌రెడ్డిని మధు పరామర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, చీమల వంశీ, మాజీ ఎంపీటీసీ రాజమణి, విక్రమ్, కొండగొర్ల వెంకటస్వామి, జక్కు శ్రావణ్, మనోహర్, శ్రీశైలం, తదితరులు ఉన్నారు.

ఘనంగా బొమ్మల కట్టయ్య జయంతి

చిట్యాల : దళిత, బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడిన ప్రజారత్న అవార్డు గ్రహీత బొమ్మల కట్టయ్య జయంతి వేడుకలను మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లయ్య మాట్లాడుతూ బొమ్మల కట్టయ్య తెలంగాణ మైనారిటీ కమిషన్ మాజీ సభ్యుడు, దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడుగా పనిచేశారని గుర్తు చేశారు. మారుమూల ప్రాంతాల్లో అంబేడ్కర్ ఆశయాలు ఆలోచనలు ప్రజలకు తెలియజేస్తూ అంబేడ్కర్ యువజన సంఘాలను బలోపేతం చేయడానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్, మండల నాయకులు ఆరెపల్లి నర్సింహా రాములు, సరిగమ్ముల రాజేందర్, ప్రసాద్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నవీన్

ఏటూరునాగారం : విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఈట నవీన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. సామాజిక శాస్త్రం (చరిత్ర, రాజనీతి, ఆర్థిక శాస్త్రం)లోని అధ్యాపకుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై పరిజ్ఞానం కోసం, వివిధ విభాగాల నుంచి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలు ప్రభుత్వం నిర్వహించే వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల్లో మొదటి, రెండో బహుమతిని సాధించిన విద్యార్థులను ప్రశంసిస్తూ, బహుమతుల ప్రదానానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటయ్య, రమేష్, భాస్కర్, జ్యోతి, ఫాతిమా, జీవవేణి, మున్ని, సంపత్, సుమలత, శేఖర్, భావన తదితరులు పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మంగపేట : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి బుధవారం పంపిణీ చేశారు. కమలాపురం, మంగపేట, తిమ్మంపేట తదితర గ్రామాలకు చెందిన బాధితులు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య చేయించుకున్నారు. మంత్రి సీతక్క చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధిద్వారా మంజూరైన రూ.4.60 లక్షల విలువైన చెక్కులను బాధితులకు అందజేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- గౌడపల్లెలో బోరుబావి ఏర్పాటు



బోరుబావి ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

మల్హర్ : తాడిచర్ల గ్రామంలోని గౌడ (మాచేర్ల) పల్లెలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు బుధవారం నూతన బోరుబావిని ఏర్పాటు చేశారు. తాగునీటి ఎద్దడి ఉందని స్థానికులు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా డీఎంఎఫ్‌టీ నిధులు ద్వారా గ్రామానికి నాలుగు బోర్లు మంజూరయ్యాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా గౌడ పల్లెలో నూతన బోరు బావి ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యామ్‌సుందర్, కార్యదర్శి మల్లికార్జున్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ దండు రమేశ్, మాజీ ఎంపీటీసీ తిర్రి సమ్మయ్య, కుంట సదానందం, రావుల ఆంజనేయులు, మధుకర్, రాజయ్య, చంద్రమౌళి, తిరుపతి, సత్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

- శ్రీపాద ట్రస్టు చైర్మన్ శ్రీనుబాబు



నివాళులర్పిస్తున్న శ్రీనుబాబు, నాయకులు

కాళేశ్వరం : యువత క్రీడాస్ఫూర్తిని చాటాలని శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు పేర్కొన్నారు. గ్రామాల్లోని యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. బుధవారం మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో మాజీ సర్పంచ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ఎరవెల్లి విలాస్‌రావు ఆధ్వర్యంలో శ్రీపాదరావు స్మారక జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా టోర్నీలో మొత్తం 40 టీంలు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో అంబట్‌పల్లి వర్సెస్ దమ్మూరు టీంలు తలపడ్డాయి. దమ్మూర్‌కు మొదటి, అంబట్‌పల్లికి ద్వితీయ బహుమతులను ఆయన అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెల్లోని యువతో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోట రాజబాపు, మాజీ జెడ్పీటీసీ రాజిరెడ్డి, నాయకులు చీమల సందీప్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపు, సుగుణ, సత్తమ్మ, శ్రీనివాస్, కట్కం అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, గుర్సింగ బాపు, రాహుల్ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న గౌడ్ సంఘం నాయకులు

కాటారం : బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని గౌడ సంఘం అధ్యక్షుడు చీటూరి రాజలింగు గౌడ్ పేర్కొన్నారు. బుధవారం పాపన్న వర్ధంతిని మండలంలోని ధన్వాడలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించగా రాజలింగుగౌడ్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు గౌడ కులస్తులు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మార్క రవీందర్ గౌడ్, చిటూరి మల్లయ్య, చీకట్ల స్వామి, తిరుపతి, రాజీర్, రాజబాబు, గణపతి, శంకర్, వెంకన్న, మహేశ్, కిరణ్, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

కార్యదర్శిపై ఎంపీడీఓకు ఫిర్యాదు

కాటారం : మహాముత్తారం మండలం మాదారం గ్రామపంచాయతీ కార్యదర్శి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ బుధవారం అదే గ్రామానికి చెందిన పలువురు ఎంపీడీఓ శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి తన అధికార పరిధిలో లేని మామిడికుంట చెరువును అనధికారికంగా గ్రామంలోని కొంతమందితో కలిసి చేపల పెంపకం కోసం అక్రమంగా వేలం వేస్తున్నట్లు తెలిపారు. గత వర్షాకాలం పంటకాలంలో చెరువులో చేపలు వేసేందుకు అక్రమంగా వేలం నిర్వహించగా రైతులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లడంతో మత్స్యశాఖ అధికారులను మందలించడం జరిగిందన్నారు. అయినప్పటికీ పంచాయితీ కార్యదర్శి ఆయకట్టుతో సంబంధం లేని కొందరు మాదారం గ్రామస్తులు, చేపల పెంపకందారులతో కలిసి అక్రమంగా వేలం నిర్వహించి చెరువులో చేపలు పెంచడానికి సహకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతులు పంట సాగు చేయగా ఈ అక్రమ చర్యల వల్ల చెరువులో నీరు ఇంకిపోయిందని ఆరోపించారు. ఐదేళ్లుగా ఇదే తంతుసాగుతోందని దీనిపై విచారణ జరిపి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను ఫిర్యాదుదారులు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ప్రభాకర్, రవి, వెంకటయ్య, అశోక్, సమ్మయ్య ఉన్నారు.

రాజ్యాంగ విలువలపై అవగాహన అవసరం



గణపురం: ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు



టేకుమట్ల: ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: రాజ్యాంగ విలువలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, అందులో భాగంగానే ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికే రాహుల్ గాంధీ.. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదానికి పిలుపునిచ్చారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని చెల్పూరు గ్రామంలో బుధవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్ రెడ్డితో కలసి పాల్గొన్నారు. అనంతరం గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన దేశ రాజ్యాంగం అమల్లోకి వచ్చి75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలు పెంచడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదన్నారు. రాజ్యాంగం ఒక పుస్తకం కాదని అంబేడ్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వ్యక్తుల ఆలోచనలతో కూడిన పవిత్ర గ్రంథం అని అన్నారు. పార్లమెంట్ సాక్షిగా బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అనగదొక్కాలని చూస్తుందని ఆరోపించారు. అమిత్ షా.. అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారని అన్నారు.

మతతత్వ పార్టీలను తరిమికొట్టాలి

టేకుమట్ల : మతతత్వ పార్టీలను తరిమికొట్టి, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర మండల ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాఘవాపూర్‌లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను ప్రారంభించి, రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..గత కొంత కాలంగా బీజేపీ నాయకులు, కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ, బాబా సాహేబ్ అంబేడ్కర్, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని మండిపడ్డారు. స్వాతంత్య్ర పోరాటంలో గాంధీ కుటుంబీకుల త్యాగాలు, దేశ అభివృద్ధికి వేసిన పునాదులను దేశ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని వివరించారు. స్వాతంత్య్ర ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ, నాయకులు తప్ప బీజేపీ నాయకులు ఎక్కడా లేరని గుర్తు చేశారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారపోస్తూ, బడుగు, బలహీన వర్గాలను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశాన్ని మతతత్వ మంటలను రెచ్చగొడుతున్న బీఆర్ఎస్, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సంగి రవి, జిల్లా నాయకులు దొంతుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు వైనాల రవీందర్, మాధవ కొమురయ్య, శాస్త్రాల కిరణ్, పైడిపల్లి సతీష్, భూపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న రాంచంద్రయ్య

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జిల్లా ఆర్‌టీఏ మెంబర్ సుంకరి రాంచంద్రయ్య బుధవారం సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 3.10 కోట్ల మందికి సన్న బియ్యంతో లబ్ధి పొందున్నారని తెలిపారు. త్వరలోనే మరో 30 లక్షల కొత్త రేషన్ కార్డులు రానున్నాయన్నారు. నాయకులు అంబాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తోట సంతోష్, సివిల్ సప్లయ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.